




పిట్టగోడ పడి కార్మికుడు మృతి

ప్రజాశక్తి-పొదలకూరు
మండలంలోని మహమ్మదాపురం గ్రామంలో శిథిలావస్థకు చేరిన హాస్టల్ భవనాన్ని శుక్రవారం కూలుస్తుండగా ప్రమాదవశాత్తు గోడపడి కె వెంకటేశ్వర్లు(33) మతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు..సంగంకు చెందిన వెంకటేశ్వర్లు మరికొందరు కూలీలతో కలిసి భవనం కూల్చే పనికి వచ్చారు. ఈ భవనం కూల్చే పని గత 20 రోజులుగా జరుగుతోంది. ఈరోజు తో పని పూర్తికావచ్చింది. పని మధ్యలో వెంకటేశ్వర్లు మంచినీళ్ల తాగేందుకు పక్కకు వెళ్లాడు. అదే సమయంలో పక్కనే ఉన్న భవనం పైనున్న పిట్టగోడ విరిగి వెంకటేశ్వర్లుపై పడటంతో అక్కడికక్కడే మతి చెందాడు. మతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ షేక్ కరీముల్లా సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



జాబిలి వైపు పరుగులు..!

- చంద్రయాన్-3 విజయవంతం
- ఆగస్టు23న ల్యాండింగ్
- ఆకాశానికి హద్దుల్లేవ్ - కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో అద్భుతం సాధించింది. చంద్ర మామ రావే..జాబిల్లీ రావే అనే కలలను సాకారం చేసు కోడానికి తొలి అడుగు వేసింది. ఇప్పటికే రెండు ప్రయోగాలు చేసిన ఇస్రో శుక్రవారం ఉమ్మడి నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి రెండో ప్రయోగ వేదిక నుంచి నిర్వహి ంచిన చంద్రయాన్-3 విజయ వంతమైంది. నిర్ణీత కక్ష్యలో కేవలం 16 నిమిషాల్లో చేరుకుంది. సుదీర్ఘ ప్రయాణం అనంతరం ఆగస్టు 23న చందమామపై ల్యాండింగ్ కానుంది. ఇప్పుడు దేశమంతా ఈ ప్రయోగం వైపు ఆసక్తిగా చూస్తుంది..



ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి
భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరోమారు చంద్రయాన్ ప్రయోగ తొలి దశను విజయవంతంగా పూర్తి చేసింది. సతీష్‌ధావన్ స్పేస్‌సెంటర్ (షార్) నుంచి రెండో ప్రయోగ వేదిక నుండి శుక్రవారం మధ్యాహ్నం 2.35 గంటలకు బయలు దేరింది. కేంద్ర సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ముఖ్య అతిథిగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. షార్ నుంచి బయలు దేరిన కేవలం 16 నిమిషాలకు భూమికి దగ్గరగా 170 కిలో మీటర్ల దూరంగా 36,500 కిలో మీటర్ల దూరంలో చంద్రయాన్-3 (ఎల్‌విఎం-3) ఎం4 రాకెట్ ద్వార దూసుకు పోయింది.సరిగ్గా 16 నిమిషాలకు స్థిర కక్ష్యలో చేరింది. దీంతో అందరూ హర్షధ్వానాలు వ్యక్తం చేశారు.రాకెట్ ప్రయోగ తొలి దశ విజయవంతం కావడంతో శాస్త్ర వేత్తలతోపాటు, అందరూ ఆనందం వ్యక్తం చేశారు. ఉపగ్రహం సుదీర్ఘ ప్రయాణం చేసిన తరువాత ఆగస్టు 23న చంద్ర మామపై ల్యాండింగ్ చేయడానికి ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధం చేశారు. చంద్రయాన్-1, చంద్ర యాన్ -2 ప్రయోగాలు ల్యాండింగ్ కాకుండానే విఫలమైన విషయం తెలిసిందే. 2019 చంద్రయాన్-2 ప్రయోగం షార్ నుంచి జరిగింది. సుదీర్ఘ ప్రయాణం అనంతరం ల్యాండింగ్ సమయంలో పక్కకు ఒరిగిపోవడంతో ఆ ప్రయోగం విఫలమైంది. మూడేళ్ల కఠోర శ్రమ తరువాత ఇస్రో మరో సారి ఈ ప్రయోగానికి సిద్ధమైంది.

ప్రయోగం సాగిందిలా..!
చంద్రయాన్-3 ప్రయోగం అందరిలో ఆసక్తి నెలకొల్పింది. సుమారు 20 వేల మంది సదర్శకులను అనుమతించారు. దేశవ్యాంతంగా సుమారు 500 మంది జర్నలిస్టులు ఈ ప్రయోగం కవర్ చేయడానికి వచ్చారు. 3900 కిలోల బరువు కలిగిన చంద్ర యాన్-3, ఇందులో ల్యాండర్, రోవర్ బరువు 1752 కిలోలు, ప్రావల్షన్ మాడ్యుల్ 2,486 కిలోలు, గతంలో జరిగిన ప్రయోగాలకు భిన్నమైనది. ఎల్‌విఎం-3 రాకెట్ పొడవు 43.5 మీటర్లు వెడల్పు 4 మీటర్లు, లిప్టాప్ బరువు 640 టన్నులతో మూడు దశల్లో ప్రయోగం నిర్వహించారు. గత చంద్రయాన్ సమయంలో జరిగిన అన్ని పొర పాట్లు అధికమించారు. ఈ ప్రయోగం కోసం ఒక్క ఏడాది ఇస్రో కష్టపడింది. వేలాది మంది శాస్త్రవేత్తలు, కార్మికులు దీని కోసం పనిచేశారు. ప్రతిక్షణం ఉత్కంఠలా ఉంటుందని ఇస్రో చెబుతోంది.38 రోజులు సుదీర్ఘ ప్రయాణం చేసిన తరువాత ఆగస్టు 23 సాయంత్రం 5.47 నిమిషాలకు చంద్రునిపై ల్యాండింగ్ అవుతుంని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ సోమనాధన్ తెలిపారు. అప్పటి వరకు ప్రతి పక్షం ఇస్రో దానిని కంటికి రెప్పలా చూస్తుందని తెలిపారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో షార్‌లో ఉషార్ కనిపించింది.

ఆకాశానికి హద్దులు లేవు. ఈ విజయం దేశానికిది - మంత్రి జితేంద్ర
చంద్రయాన్ -3 తొలిదశ ప్రయోగం విజయవంతం కావడంతో ఆకాశానికి హద్దులు లేవని మరోసారి రుజువైందన్నారు. ప్రయోగం విజయవంతం తరువాత ఆయన షార్‌లో మీడియా సెంటర్‌లో మాట్లా డారు. ఇండియా సాంకేతిక రంగంలో మరో స్థాయికి చేరిందన్నారు. అప్పటికే అగ్రదేశాలకే పరిమి తమైన చంద్రయాన్‌లో భారత్ చేరిందన్నారు. ప్రధాని నరేంద్రమోడీ ఇస్రోకు అవసరమైన నిధులు ఇవ్వడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుం టున్నారన్నారు. ప్రభుత్వం ఎంతైనా సాంకేతిక రంగానికి ఖర్చు పెడుతున్నా మన్నారు. ఈ ప్రయోగంలో మిషన్ డైరెక్టర్ మోహన్ కుమార్, విక్రమ సారాబాయ్ స్పేస్ సెంటర్ డైరెక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్, ఎల్‌పిఎస్‌సి డైరెక్టర్ వి.నారాయణ్, యుఆర్‌ఎస్‌సి డైరెక్టర్ ఎం.శంకరన్, ఎస్‌ఎసి డైరెక్టర్ నిలేష్ ఎ. దేశాయ్, షార్ డైరెక్టర్ ఎ.రాజారాజాన్, తిరుపతి ఎంపి గురుమూర్తి, వైసిపి నేత అప్పల రాజు, మాజీ ఇస్రో ఛైర్మన్లు రాధాకృష్ణన్, డాక్టర్ శివన్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సకాలంలో వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-నెల్లూరు
గర్భిణులు సకాలంలో వైద్యులచే పరీక్షలు నిర్వహించుకోవడం ద్వారా మాతా , శిశు మరణాలను నివారించడం సులభతరం అవుతుం దన్నారు. శుక్రవారం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మాతా శిశుమరణాలపై సబ్‌కమిటీ విశ్లేషణాత్మక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల సంభవించిన రెండు మాతృమరణాలపై ,11 శిశుమరణాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎం.పెంచలయ్య మాట్లాడుతూ ముఖ్యంగా గర్భిణుల్లో రక్తహీనత నివారణకు అవసరమై సలహాలు సూచనలు చేయాలన్నారు. ముఖ్యంగా పోషకాహార ప్రాధాన్యతను వివరించాలన్నారు. వైద్యులు గర్భిణులకు సకాలంలో పరీక్షలు నిర్వహించి సరైన ప్రసవ ప్రణాళిక ద్వారా మాతృ, శిశు మరణాలను నివారించడం సాధ్యమౌ తుందన్నారు. ఈ సమావేశ మందిరంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ రమేష్‌నాథ్, డాక్టర్ బ్రిజిత, డాక్టర్ దయాకర్, డాక్టర్ శెలీనా కుమారి, డాక్టర్ ఇందిరా, డాక్టర్ ఐవి.రమణయ్య, డాక్టర్ కవిత, డాక్టర్ హేమంత్, పలువురు ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లపై 'వంగలపూడి' విమర్శలు హేయం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :ఎపి తెలుగుదేశం మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత వలంటీర్లపై చేసిన విమర్శలు అత్యంత హేయమని వైసీపీ జిల్లా అ ధికార ప్రతినిధి తలమంచి సురేంద్ర బాబు అన్నారు. వలంటీర్లపై వంగలపూడి విమర్శలను సురేంద్ర బాబు శుక్రవారం ఖండించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నిస్వార్థంగా అ మూల్యమైన సేవలు అందిస్తూ నిరుపేదల అభినందనలు అందుకుం టున్నారన్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా సేవ చేసే వాలంటీర్లను వంగలపూడి విమర్శిం చడం దారుణమని తెలిపారు. నిస్వార్థ సేవలు అందించే వలంటీర్లను అసభ్య పదజాలంతో విమర్శించిన టీడీపీ రానున్న ఎన్నిక ల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని తెలిపారు.

టోల్‌ప్లాజా నిర్మాణ పనులపై ఆందోళన



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు
స్థానిక సుందరయ్యకాలనీ సమీపంలోని జాతీయ రహదారిపై సిపిఎం ఆధ్వర్యంలో కార్పొరేషన్ పరిధిలోని మినీబైపాస్ రోడ్డు ప్రాంతంలో నిర్మిస్తున్న టోల్ ప్లాజా పనుల వర్క్ ఆర్డర్ ఉపసంహరించుకోవాలని కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం సుందరయ్య కాలనీ ప్రాంతంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో కార్యక్రమం చేపట్టారు. అనంతరం సుందరయ్యకాలనీ, డి బ్లాక్ ప్రాంతంలో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు విచ్చేసిన ఎంపి ఆదాల ప్రభాకరెడ్డిని స్థానిక సిపిఎం శాఖ ఆధ్వర్యంలో ప్రజలు అడ్డుకున్నారు. నగర పరిధిలో టోల్‌ప్లాజా నిర్మించడం వల్ల ఎదురయ్యే సమస్యలను ఎంపికి వివరించి, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి ఈ నిర్మాణ పనులు నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కష్ణయ్య మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా టోల్ ప్లాజా కు ఇచ్చినటువంటి అనుమతిని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. నగరానికి అతి సమీపంలో ఉన్న జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా నిర్మించడం వల్ల భారీ వాహనాలు టోల్ బిల్లులు చెల్లించకుండా ఉండేందుకు నగరంలోకి ప్రవేశిస్తాయన్నారు. ఈ నేపథ్యంలో నగరం రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారుతుందన్నారు. చింతా రెడ్డిపాలెం , కనుపర్తిపాడు వద్ద హైవేలో ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలన్నారు. సిపిఎం రూరల్ కార్యదర్శి వర్గ సభ్యులు కిన్నెర కుమార్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో టోల్ ప్లాజా నిర్మించడం వలన స్థానిక ప్రజలు కూడా టోల్ బిల్లులు కట్టవలసి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ పరిధిలోని ప్రజలందరూ ఈ టోల్గేట్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ టోల్‌ప్లాజా నిర్మాణానికి అనుమతిస్తూ కాంట్రాక్టర్‌కు అందజేసిన వర్క్ ఆర్డర్‌ను రద్దు చేయాలన్నారు. లిఖిత పూర్వకమైన హామీని కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకోవాలన్నారు. కేంద్రం నుంచి స్పందన రాకపోతే అఖిల పక్షం ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రజలందరినీ ఐక్యం చేసి దశలవారీగాఈ పోరాటాన్ని ఉధతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం రూరల్ కమిటీ సభ్యులు వీర్ల శ్రీనివాసులు, 23వ డివిజన్ శాఖ కార్యదర్శి ఒంగోలు సుధీర్, డివైఎఫ్ఐ నాయకులు గోను చైతన్య, మదన్, గంగుల సునీల్ ,సిపిఎం సానుభూతిపరులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


ఎంపి ఆదాలతో మాట్లాడుతున్న నాయకులు

కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరునగరపాలక సంస్థ కార్యాలయం ప్రాంగణంలో నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారం భానికి సిద్ధంగా ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్ ను కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నూతన కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుతో నగర వ్యాప్తంగా మెరుగైన పారిశుధ్య సేవలు అందించడం సాధ్యమవు తుందని, పారిశుధ్య నిర్వహణ పనులను నిరంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచే పర్యవేక్షించే సాంకేతికతను సెంటర్ లో ఏర్పాటు చేశామని తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన కమాండ్ కంట్రోల్ సెంటర్ లో నగర వ్యాప్తంగా జరుగుతున్న అభివద్ధి పనుల పర్యవేక్షణతో పాటు, నగర పాలక సంస్థ అన్ని విభాగాల సమీక్ష సమావేశాలు, మునిసిపల్ శాఖ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లు,ప్రకతి విపత్తు నిర్వహణ కేంద్రం సేవలు, స్పందన పరిష్కార వేదిక, నగరపాలక సంస్థ సమగ్ర సమాచార విభాగం వంటి వివిధ విధులను నిర్వహిం చను న్నామని తెలిపారు.కార్యక్రమంలో అధికారులు సంజయ్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ల మందారెడ్డి శత జయంతి ఉత్సవాలు జరపాలి

ప్రజాశక్తి-కందుకూరు:మాజీ పార్లమెంట్ సభ్యులు కమ్యూనిస్టు ఉద్యమ జాతీయ నేత కీర్తిశేషులు గుజ్జుల ఎల్లమందారెడ్డి శత జయంతి ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించాలని కందుకూరు నియోజకవర్గం కౌన్సిల్ సమావేశం తీర్మానించింది. సిపిఐ కందుకూరు నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం సిపిఐ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి మాలకొండయ్య మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా కనిగిరి తాలూకా నేరేడుపల్లె గ్రామంలో జన్మించిన గుజ్జుల ఎల్లమందరెడ్డి శత జయంతి ఉత్సవాలు ప్రకాశం నెల్లూరు జిల్లాలో పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నామని అన్నారు. ఎల్లమందారెడ్డి శాసనసభ్యులుగా అనంతరం పార్లమెంట్ సభ్యులుగా కొనసాగారు. శిక్షణా తరగతులకు శాఖా కార్యదర్శులు నియోజకవర్గ సమితి సభ్యులు హాజరు కావాలని కోరారు. ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు జరిగే బస్సు యాత్రలో పార్టీ సభ్యులు సానుభూతిపరులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.




గృహాల సర్వే 90శాతం పూర్తి చేయాలి

ప్రజాశక్తి-వలేటివారిపాలెం:గ్రామాల్లో గృహాల సర్వే 90 శాతం పూర్తి చేయాలని కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక సచివాలయ సిబ్బందికి సూచించారు. మండల కేంద్రమైన వలేటివారిపాలెంలోని ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి సమావేశం నిర్వహించారు. కొండసముద్రం, శామీరపాలెం, పోకూరు, వలేటివారిపాలెం సచివాలయాల్లో త్వరలో జగనన్న సురక్ష కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సర్వేను పూర్తి చేయడంతో పాటు, సర్వే ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయాలన్నారు. అవసరమైన ధృవపత్రాలు ఉచితంగా అందజేస్తామనే విషయాన్ని తెలపాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురి పనితీరుపై సబ్‌కలెక్టర్ మండిపడినట్లు తెలిసింది. కార్యక్రమంలో డిఎల్‌డిఒ పద్మజ, తహశీల్దార్ సుందరమ్మ, ఎంపిడిఒ షేక్ రఫీక్‌అహ్మద్, ఇఒఆర్‌డి సుమంత్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

'ప్రకాష్ చవల'కు సన్మానం

ప్రజాశక్తి-కందుకూరు: ఒంగోలు లో ప్రముఖ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్ ప్రముఖ ఆర్థోస్కోపి, జాయింట్ రీప్లేస్మెంట్ వైద్యులు డాక్టర్ ప్రకాష్ చవల ను ప్రకాశం జిల్లా వాసవి సేవాదళ్ అధ్యక్షులు చీదేళ్ళ వేణుగోపాలరావు, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం మీడియా చైర్మెన్ చక్కా వెంకట కేశవరావు శుక్రవారం కందుకూరులో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ ప్రకాష్ చవల కందుకూరు కు చెందిన ఆర్యవైశ్యులు చెన్నగిరి హరిబాబుకు హిప్ రిప్లేస్మెంట్ విజయవంతంగా పూర్తి చేశారని అన్నారు. పేషంట్ తాను ఎప్పటిలాగే అన్ని పనులు చేసుకుంటూ చాలా ఆరోగ్యంగా ఉన్నారన్నారు. అదేవిధంగా అతి ఖరీదైన ఈ ఆపరేషన్ ను డాక్టర్ ప్రకాష్ చవల తక్కువ ఖర్చుకి చేసినందుకు తన ఆపరేషన్ విజయవంతైనందుకు చెన్నగిరి హరిబాబు డాక్టర్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా హరిబాబు తన ఆపరేషన్‌కి సహకరించిన ఆర్యవైశ్యులకి ధన్యవాదాలు తెలిపారు. కేవలం వ్యాపార దక్పథంతోనే కాకుండా డాక్టర్ ప్రకాష్ చవల సామాజిక సేవా దక్పథంతో ఎంతోమంది పేదవారికి తన వంతు సహాయ సహకారంగా పేదలకు వైద్యం అందిస్తున్నారని వేణుగోపాలరావు, కేశవరావు డాక్టర్ కి ధన్యవాదాలు తెలిపారు.


సన్మానిస్తున్న దృశ్యం

డ్రెయినేజీ కాలువల పనులకు శంకుస్థాపన


ప్రజాశక్తి-నెల్లూరు
రూరల్ నియోజకవర్గం పరిధిలోని 24వ డివిజన్ సుందరయ్య కాలనీ, జాషువా నగర్ లో డ్రెయినేజీ కాలువల నిర్మాణ పనులకు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. శుక్రవారం అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ఎంపి ఆదాల మాట్లాడుతూ రూ. 42 లక్షల వ్యయంతో డ్రెయినేజీ కాలువల నిర్మాణం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో డ్రెయినేజీ కాలవలు సక్రమంగా లేకపోవడం వల్ల మురుగునీరు వెళ్లేందుకు వీలు లేక ఈ ప్రాంతంలో స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా డ్రెయినేజీ కాలువల నిర్మాణం చేపట్టాలని స్థానిక వైసిపి నాయకులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. స్థానిక ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి డ్రెయినేజీ కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించామన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. ముఖ్యంగా విద్యా, వైద్యరంగానికి పెద్దపీట వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయకుమార్ రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, హరిబాబు యాదవ్, నూనె మల్లికార్జున్ యాదవ్, ఏసు నాయుడు స్థానిక కార్పొరేటర్లు ఒరిస్సా శ్రీనివాసరెడ్డి, మొయిళ్ల గౌరి, మూలే విజయ్ కుమార్ రెడ్డి, వైసిపి సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మాలెం సుధీర్ కుమార్ రెడ్డి, అన్నపురెడ్డి శ్రీదేవి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి విద్యార్థినులు ఎంపిక

ప్రజాశక్తి-పొదలకూరు:పట్టణంలోని డిఎన్‌ఆర్ బాలికల ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించి 2022-2023 విద్య సంవత్సరానికి గాను ట్రిపుల్ ఐటికి ఏడుగురు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు అభినందనల సభ ఏర్పాటు చేశారు. పొదలకూరు బాలికల జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశా లలో పదవ తరగతి చదువుతూ నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళంలోని కళాశాలలో సీటు సాధించారు. వారిలో అచ్చి వైష్ణవి, తేజశ్రీ, సాయి భార్గవి, అజ్మాత్ అనే నలుగురు విద్యార్థులు నూజివీడు కళాశాలలో సీటు సాధించగా, తేజస్విని, శ్రీవిద్య విద్యార్థులు ఇడుపులపాయ కళాశాలలో సీట్లు సాధించారు. జయ లాస్య ప్రియ, శ్రీకాకుళం కళాశాలలో సీటు సాధించింది. ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యనభ్యసించి సీటు సాధించేందుకు కషి చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బందానికి వారు కతజ్ఞతలు తెలియజేశారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థినులు

నాగార్జున స్కూల్
పొదలకూరు పట్టణంలోని నాగార్జున స్కూల్ విద్యార్థిని ఎంఎం సమీర ట్రిపుల్ ఐటిలో సీట్ సాధించింది. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం శుక్రవారం ఏర్పాటు చేసిన ఒక సమావేశంలో అభినం దించింది. సీటు సాధించిన విద్యార్థినికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సమీర మాట్లాడుతూ నాగార్జున స్కూల్ యాజమాన్యం ప్రోత్సాహం, అంకితభావంతో టీచర్ల విద్యాబోధనతో తాను పదవ తరగతిలో 584 మార్కులు సాధించి ట్రిపుల్ ఐటిలో సీటు దక్కించుకున్నానని తెలిపారు. ఈ సీటు సాధించేలా తనను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు, పాఠశాల యజమాన్యానికి,ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు.



తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి-ఉలవపాడు:కందుకూర్ నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లా లోనే కొనసాగించేల ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని శుక్రవారం నాడు జేపీసీ బీసీ రాష్ట్ర చైర్మన్ మరియం శ్రీనివాసులు ఉలవ పాడు తహశీల్దార్ బ్రహ్మయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో లాగే కందుకూరు నియోజకవర్గాన్ని ఒంగోలు జిల్లాలోని సాగించేలా చర్యలు తీసుకోవాలని ఇది నియోజకవర్గ ప్రజలకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట చాకిచెర్ల మాజీ సర్పంచ్ పొడమేకల వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

16న ఎంఆర్‌పిఎస్ సమావేశం

ప్రజాశక్తి-కందుకూరు: ఈ నెల 16తేది ఆదివారం రోజున ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకష్ణ మాదిగ ఉమ్మడి ప్రకాశం జిల్లా కు విచ్చేయుచున్నారని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకులు వర్ల దేవదాసు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు ఒంగోలులోని అంబేద్కర్ భవన్‌లో మాదిగ ఉద్యోగులు ఆత్మీయ కలయిక కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంద కష్ణమాదిగ రానున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆగస్టులో హైదరా బాద్‌లో జరగబోయే మాదిగల విశ్వరూప సభ సంబంధించి భవిష్యత్తు కార్యాచరణ రపొందించుకోవడం కోసం విచ్చేయుచున్నట్లు తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా లోని మేధావులు, ఉద్యోగ పెద్దలందరూ శ్రేయోభి లాషులు అధిక సంఖ్య లో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు:బారా షాహీద్ దర్గా రొట్టెల పండుగకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా కీర్తి ప్రతిష్టలు పెరిగేలా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డి అధికారులను ఆదేశిం చారు. ఈ నెల 29వ తేదీ నుంచి రొట్టెల పండుగ జరగనున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లపై శుక్రవారం బారా షాహీద్ దర్గా సమావేశ ప్రాంగణంలో ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ తో కలసి అధికారులతో, శాఖల వారీగా చేప ట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లు పై సమీక్షిం చారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ కుల, మతాలకు,కులాలకు అతీతంగా జరగనున్న బారా షాహీద్ దర్గా రొట్టెల పండుగకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా కీర్తి ప్రతిష్టలు పెరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన ఆవసరం ఉందన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, ఆర్.డి.ఒ మాలోల, ఆర్ అండ్‌బి, మున్సిపల్ శాఖ ఎస్.ఇ లు గంగాధర్, సాయికృష్ణ, వక్ఫ్ బోర్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు

యువగళానికి భారీ ఏర్పాట్లు

టిడిపి పార్లమెంటు ఉపాధ్యక్షులు ఇంటూరి

ప్రజాశక్తి-లింగసముద్రం
తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను జయప్రదం చేయాలని టిడిపి నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాజేష్ యువగళం పాదయాత్ర వివరాలను ప్రజాశక్తికి వెల్లడించారు. యువగళం పాదయాత్ర ఈనెల 15వ తేదీ సాయంత్రం ఉదయగిరి నుంచి ఉమ్మడి ప్రకాశం జిల్లా, ప్రస్తుత నెల్లూరు జిల్లా లింగసముద్రం మండలంలోకి ప్రవేశిస్తుందన్నారు. లింగసముద్రం మండలం, పెంట్రాల పంచాయతీకి పాదయాత్ర చేరుకుని అక్కడ స్థానికులతో లోకేష్ మాట్లాడతారు. అక్కడనుంచి లింగసముద్రం మండలం జంపాలవారి పాలెం, వాకమళ్లవారిపాలెం మీదుగా లింగసముద్రం పట్టణానికి చేరుకుంటారు. స్థానిక తిరుమణిశెట్టి కోటయ్య సమాధి సెంటర్ మీదుగా ఎస్సీ కాలనీ, బలిజపాలెం, రామకష్ణాపురం, వెంగళాపురం వరకు మొత్తం 17.5 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహిస్తారు. 15వ తేదీ రాత్రికి యర్రారెడ్డిపాలెం పంచా యతీ లోని వెంగళా పురంలో బసచేస్తారు. అనం తరం 16వ తేదీ ఉదయం వెంగళాపురం నుండి ప్రారం భమయ్యే పాదయాత్ర అమ్మపాలెం, బంగారక్క పాలెం మీదుగా మండల కేంద్రమైన వలేటివారిపాలెంకు చేరుకుంటుంది. 16వ తేదీ సాయంత్రం5 గంటలకు వలేటివారిపాలెంలో నారా లోకేష్ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం వివిపాలెం మండలం లింగపాలెం, రామచంద్రాపురం మీదుగా రాత్రి 8 గంటలకు లోకేష్ యువగళం పాదయాత్ర కొండపి నియోజకవర్గం లోకి ప్రవేశిస్తుందన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలు భారీగా హాజరై లోకేష్ యువగళం పాదయాత్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.



నిర్ణీత గడువులోగా భవన నిర్మాణాలు పూర్తి

ప్రజాశక్తి-నెల్లూరు
జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల కింద చేపట్టిన నూతన గ్రామ/వార్డు సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలను ప్రభుత్వం సూచించిన నిర్ణీత గడువులోగా పూర్తిచేయుటకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఎం. హరి నారాయణన్ పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె ఎస్ జవహర్ రెడ్డి శుక్రవారం వెలగపూడి సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాల పురోగతి, వైద్య ఆరోగ్యశాఖ, జగనన్న విద్యా కానుక, పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, నాడు నేడు, స్త్రీ, శిశు సంక్షేమ, జగనన్నకు చెబుదాం, ఆడుదాం ఆంధ్ర తదితర అంశాలపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణం నుంచి కలెక్టర్ ఎం. హరి నారాయణన్ పాల్గొని, జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల కింద చేపట్టిన నూతన గ్రామ/వార్డు సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వై.ఎస్.ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ ల నిర్మాణాల పురోగతిని వివరిస్తూ ప్రభుత్వం సూచించిన నిర్ణీత గడువులోగా పూర్తిచేయుటకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. సిమెంట్ కొరత కారణంగా భవనాల నిర్మాణాల్లో కాస్త జాప్యం జరుగుతుందని, పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో ప్రకారం బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండేలా చర్యలు చేపడుతున్నామన్నారు. గత రెండు రోజులుగా సచివాలయాలు, పాఠశాలలను తనిఖీ చేసి బడికి రాని విద్యార్థుల వివరాలను వాలంటీర్ల సర్వే ద్వారా తెలుసుకుని, వారంతా బడికి వచ్చేలా కషి చేస్తున్నట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్, పంచాయతీ రాజ్ ఎస్ఇ అశోక్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య, డిఆర్‌డిఎ పీడీ సాంబ శివారెడ్డి, జెడ్‌పిసిఇఒ చిరంజీవి, డిఇఒ గంగాభవాని, సమగ్ర శిక్ష ఏపిసి ఉషారాణి, సిపిఒ ఎస్.రాజు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడతుఉన్న కలెక్టర్

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- రైతు సంఘం, కౌలు రైతు సంఘం



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : నకిలీ విత్తనాలతో మోసపోయిన మహిమలూరు గ్రామ పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం నాయకులు మూలి వెంగయ్య, కౌలు రైతు సంఘం నాయకులు గంటా లక్ష్మీపతి, ఏపి రైతు సంఘం మండల అధ్యక్షులు కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని మహిమలూరు గ్రామంలో పూతరాని పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మూలి వెంగయ్య, గంటా లక్ష్మీపతి మాట్లాడుతూ గ్రామంలో దాదాపు 100 ఎకరాలు కిలారి, బిజిలి రకాల పత్తి విత్తనాలు వేశారని తెలిపారు. ఈ విత్తనాలు విజయవాడ నుంచి తెచ్చి నాటి ఇప్పటికి మూడు నెలలైందన్నారు. అయినా సుమారు మనిషి ఎత్తున పత్తి పంట పెరిగినప్పటికీ కానీ, పూత, పిందె రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారని తెలిపారు. ఎకరాకు రూ.30 వేలు లెక్కన ఖర్చు అయ్యిందన్నారని తెలిపారు. అయితే ఇప్పటివరకు ఈ పత్తి పంటకు పూతాపిందె రాకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైందన్నారు. ప్రైవేట్ కంపెనీల వాళ్లు రైతుకు నకిలీ విత్తనాలు అమ్మి విత్తనాలవల్లనే పంట రాకుండా పోయిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అందువల్ల ప్రభుత్వం సరైన పద్ధతుల్లో వారిపై చర్యలు తీసుకోవాలని రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కంపెనీలకు కూడా ఇక్కడికి వచ్చి పరిశీలించి పోయారని తెలిపారు. రైతులకు నష్ట నిష్ట తుడిచే దానికి వచ్చారన్నారు. రైతులకు నష్టపరిహారం చెల్లించకపోతే భవిష్యత్తులో దీనిపైన జిల్లా స్థాయిలో అవసరమైతే రాష్ట్రస్థాయిలో కూడా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

'యువగళం'లో చెంచలబాబుయాదవ్..



ప్రజాశక్తి-ఉదయగిరి : జిల్లాలోని పది నియోజకవర్గాల్లో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాజీ జెడ్పి చైర్మన్ చెంచల బాబుయాదవ్ వారి వెంట అడుగులు వేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో పర్యటించిన పాదయాత్రలో పది నియోజకవర్గంలో లోకేష్ వెంట నడిచానని ప్రతి గ్రామంలో ప్రజలు మహిళలు ఆదరణ మరువలేనిదన్నారు. ఎన్నడూ లేని విధంగా ప్రజలు స్వచ్ఛందంగా పాదయాత్రకు బ్రహ్మరథం పట్టి ఆశీర్వదించడం అధికార పార్టీకి వణుకు పుట్టిస్తుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేసిన మేనిఫెస్టో చూసి రైతులు మహిళలు చిన్నారుల తల్లులు నిరుద్యోగ యువత ప్రజాసంఘాలకు అతీతంగా పాల్గొనడం పాదయాత్రను విజయవంతం చేయడం 2024 సార్వత్రిక ఎన్నికల టిడిపి ఘన విజయానికి నిదర్శనమన్నారు. అనంతరం శనివారం కొండాపురం మండలం క్యాంప్ నుంచి పునఃప్రారంభం కానున్న పాదయాత్రను విజయవంతం చేయాలన్నారు. 11 గంటలకు నారా లోకేష్ క్యాంప్ సైట్‌కు చేరుకుంటారని, మధ్యాహ్నం 12 గంటల నుంచి లోకేష్ విత్ సెల్ఫీ కార్యక్రమం 3 గంటల వరకు అలాగే నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం ఉంటుందన్నారు. సాయంత్రం 4 గంటలకు పాదయాత్ర ప్రారంభమై సాయంత్రం 6.45 ప్రకాశం జిల్లా సరిహద్దుకు చేరుకుంటుందని కావున నియోజకవర్గ నాయకులు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్ని నారా లోకేష్‌కు పెద్ద ఎత్తున వీడ్కోలు పలకాలని పిలుపునిచ్చారు.

16న ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు నియోజకవర్గం, ఎఎస్‌పేట మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం బిల్డింగ్‌లో 16వ తేదీ నుంచి నిర్వహించే ఉచిత కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు, నాటా (నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్) మాజీ అధ్యక్షులు డాక్టర్ గోసల రాఘవరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఓ ప్రయివేట్ కళ్యాణ మండలంలో మీడియా సమావేశం నిర్వహించి వైద్యశిబిరానికి సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నైకు చెందిన శంకర నేత్రాలయ కంటి వైద్యశాల వారి సహకారంతో డాక్టర్ గోసల రాఘవరెడ్డి, డాక్టర్ గీతాంజలి కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉచిత వైద్యశిబిరం 11 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి శుక్లం ఉన్న వారికి మాత్రమే కంటి పొర ఆపరేషన్ నిర్వహిస్తారని, ఈ ఆపరేషన్లు 20వ తేదీ నుండి 24వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన వాహనంలో ప్రభుత్వం అనుమతించిన శంకర నేత్రాలయ కంటి ఆసుపత్రి వారితో ఎఎస్‌పేటలోని రైతు భరోసా కేంద్రం బిల్డింగ్‌లో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చికిత్స కోసం వచ్చే వారికి ఆపరేషన్, ఐఒఎల్ లెన్సు, కంటి అద్దాలు, మందులు ఉచితంగా అందజేస్తామన్నారు. బీపీ, షుగర్, ఇతర వ్యాధులు ఉన్నవారు కంటి చికిత్స కోసం వచ్చే సమయంలో వాళ్లు వాడే మందులు తప్పనిసరిగా తీసుకెళ్లాలని, కంటి చికిత్స జరిగిన తరువాత 2 గంటల్లో ఇంటికి వెళ్లవచ్చని తెలిపారు. చికిత్స కోసం వచ్చే వారు తప్పనిసరిగా ఫోన్ నెంబరు, ఆధార్ కార్డు జెరాక్స్‌లతో హాజరుకావాలని కోరారు. అందరూ ఈ ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైసిపి ఎఎస్‌పేట మండల జెసిఎస్ కో ఆర్డినేటర్ పులిమి వెంకట రమేష్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ గోసల రాఘవరెడ్డి తమ కుటుంబసభ్యులు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా ఈ కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారని, అందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గోసల శ్రీనివాసులరెడ్డి తదితరులున్నారు.

టమోటా విక్రయకేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఇటీవల కాలంలో ధరలు విపరీతంగా పెరిగి పేద ప్రజలకు భారంగా మారిన టమోటాలను తక్కువ ధరకు అందించేందుకు ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సహకారంతో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఆత్మకూరు నియోజకవర్గ కేంద్రంలో సబ్సిడీపై ప్రజలకు టమోటాలు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఆత్మకూరు మార్కెట్ కమిటీ గౌడౌన్‌లో సబ్సిడీపై టమోటా విక్రయాలను లాంఛనంగా ప్రారంభించి ప్రజలకు కిలో రూ.50లకు టమోటాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం టమోటా ధరలు రూ.140కు పలుకుతున్న దృష్ట్యా ప్రజలంతా ఎంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డి, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి నియోజకవర్గ ప్రజల సౌకర్యార్థం రూ.50కే కిలో టమోటా అందించేలా చర్యలు తీసుకున్నారని వివరించారు. ప్రజలంతా ఈ సబ్సిడీ టమోటా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విక్రయ కేంద్రానికి వచ్చిన ప్రజలకు టమోటాలను స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, పార్టీ పట్టణ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, సిండికేట్ ఫార్మర్ సొసైటీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, యువ నాయకులు నోటి వినయ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

17, 18న 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-సీతారామపురం : మండలంలోని బాలాయపల్లి, దేవమ్మచెరువు పంచాయతీల పరిధిలోని గ్రామాలలో 17, 18వ తేదీలలో వైసిపి ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించబడుతుందని ఎంపిడిఒ రంగ సుబ్బరాయుడు ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు తప్పక పాల్గొనాలని కోరారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : ఓటర్ల జాబితా తయారీలో బిఎల్ఒలు బాధ్యతగా వ్యవహరించాలని డ్వామా పిడి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వెంకట్రావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఉదయగిరి, సీతారాంపురం మండలాల బిఎల్ఒలు సచివాలయ సిబ్బంది విఆర్ఒతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడి పని చేయాలన్నారు. ఇంటింటికి తిరిగి ఓటర్ల సవరణ చేపట్టాలన్నారు ఒకే పోలింగ్ కేంద్రంలో కుటుంబ సభ్యులంతా ఉండేలా చూడాలన్నారు. వలస మృతి చెందిన ఓటర్ల విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కు పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్ప ఉన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్లు జగదీష్ బాబు, షాజియా, బిఎల్ఒలు, విఆర్ఒలు పాల్గొన్నారు.

29 నుంచి రొట్టెల పండుగ

ప్రజాశక్తి-నెల్లూరు : బారాషాహిద్ దర్గా ప్రాంతంలో 29వ తేదీ నుంచి జరగనున్న రొట్టెల పండుగకు దేశం నలుమూలల నుంచి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. రొట్టెల పండగ ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ విసి హాలులో కలెక్టర్ ఎం.హరినారాయణన్, ఎస్‌పి డాక్టర్ కె.తిరుమలేశ్వర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వికాస్‌తో కలిసి ఎంపి సంబంధితశాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వికాస్, డిఆర్ఒ వెంకటనారాయణమ్మ, అడిషనల్ ఎస్‌పి హిమవతి, ఆర్‌డిఒ మలోల, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి నిర్మలా దేవి, తదితర జిల్లా అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణ పరిధిలోని అట్టడుగు పేద ప్రజలు నివసిస్తున్న ఎస్.సి., ఎస్.టి. కాలనీలో చెత్తాచెదారం పేరుకుపోయి, అక్కడ నివసించే ప్రజలకు తీవ్ర అనారోగ్య ఏర్పడి అనారోగ్యం పాలవుతున్నారని, ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టి పరిశుభ్రం చేసే పనులు వేగవంతం చేయాలని జిల్లా ఎస్.సి., ఎస్.టి. జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ ఇన్నల సాయిప్రసాద్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఈ మేరకు కావలి మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయిప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యంగా బలహీన వర్గాలకు చెందిన పరిసర ప్రాంతాలలో, మురుగు నీటి కాలువలలో వ్యర్థ పదార్థాలు చేరి దోమలు, ఈగలు ఎక్కువగా ఉత్పత్తి అయి ఆయా కాలనీలలో ఉండే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా ఆర్‌టిసి బస్టాండు నుండి డిపోకు పోయే రహదారిలో, ట్రంకు రోడ్డులో ఉన్న మురికి కాలువల్లో మారుమూల ఎస్.టి. కాలనీలో చెత్తా చెదారాలు ఎక్కువగా పేరుకు పోతున్నాయన్నారు. తద్వారా పేద బలహీన వర్గాల ప్రజలు రోగాల పాలవుతున్నారు. అదేవిధంగా పట్టణ పరిధిలో ఉన్న ఎస్.సి., ఎస్.టి. కాలనీల్లో ఉన్న ప్రభుత్వ బావులను శుద్ధి చేసి, మంచి నీటిని కూడా పేద ప్రజలకు అందించాలని కోరారు. అలాగే ఆయా కాలనీలలో ఉన్న పాఠశాలలు, దేవాలయాలు, చర్చి దగ్గర చెత్తాచెదారం లేకుండా శ్రద్ధ వహించాలని కోరారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలు ప్రతి నిత్యం రహదారులను, కాలువలను శుభ్రం చెత్త నిలవ చేసే కేంద్రాల వద్ద బ్లీసింగ్ చల్లి పరిశుభ్రమైన వాతావరణం అందించి, చెడు వాసనల తొలగించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడి శుభ్రత- పరిశుభ్రత పాటించాలని ప్రజలకు తెలియజేసేలా మున్సిపల్ అధికారులు ప్రతి నిత్యం పర్యవేక్షించేటట్లు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న సాయిప్రసాద్

దళిత, గిరిజనులకు భూ పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-కావలి

దళిత, గిరిజనులకు తక్షణమే భూమి పంపిణీ చేయాలని వందల ఎకరాల్లో గ్రావెల్ తవ్వి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు మల్లి పేర్కొన్నారు. శుక్రవారం అల్లూరు తహశీల్దార్ కార్యాలయంలో ఈ మేరకు ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం అల్లూరులోని దళిత, గిరిజనులు దుర్భర పరిస్థితుల్లో జీవనం గడుపుతున్నారని జిఒ నెంబర్ 54 ప్రకారం వారికి భూమి పంపిణీ చేయాలని తెలియజేశారు. జగనన్న ఆశయం దెబ్బతినకుండా అధికారులు భూమి పంపిణీ చేయాలని కోరారు. అల్లూరు మండలం ఆములూరు గ్రామంలో 363 సర్వే నెంబర్లు వందల ఎకరాల గ్రావెల్‌ను తొవ్వుకొని సర్వనాశనం చేసిన సుకుమార్ రెడ్డి, సురేష్ రెడ్డి, రాజుపాలెం చెందిన వైసిపి నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. భూమిలేని నిరుపేదలకు భూమి పంపిణీ చేయాలని కోరారు. ఇప్పటికీ, గడ్డగుంట గ్రామాల్లో వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వందల ఎకరాల్లో గ్రావెల్ తవ్వుకొని అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమంగా గ్రావెల్ ఎత్తి సొమ్ము చేసుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మనోజ్, సత్యవతమ్మ, జయప్రకాష్, దినేష్, సుసన్న, తదితరులున్నారు.



నిరసన చేపడుతున్న దళిత, గిరిజనులు



విజయకేతనం చూపుతున్న ట్రిపుల్ఐటీకి ఎంపికైన విద్యార్థులు

ఏడుగురు విద్యార్థులకు ట్రిపుల్ఐటి సీట్లు

ప్రజాశక్తి-ఉదయగిరి

వెనుకబడిన మెట్ట ప్రాంత ప్రభుత్వ పాఠశాల నుండి ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడంపై ముఖ్యమంత్రికి, అధ్యాయపక బృందంకు స్థానికులు అభినందనలు తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ అల్లూరి రామిరెడ్డి హై స్కూల్‌లో హెచ్ఎం బాల కేశవులు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విద్యార్థులు అభినందన సభలో తల్లిదండ్రులు స్థానికులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాయపక బృందం మాట్లాడుతూ 2022– 23 బ్యాచ్‌లో ఆర్ కీర్తన, విద్య, తనుశ్రీ, షేక్ అర్షియ, షేక్ రిజ్వాన, షేక్ తన్వీర్, షేక్ అవేజ్, షేక్ ఖాతిజ సీట్లు సాధించినట్లు తెలిపారు. వారిలో ఆరుగురికి ఇడుపులపాయలో సీట్లు రాగా ఒకరికి మాత్రం క్రీడాకారుల కోటా కింద నూజివీడు వస్తుందన్నట్లు వారు తెలిపారు. విద్యార్థిని తల్లిదండ్రులు అధ్యాయపక బృందానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో షరీఫ్ అధ్యాయపక బృందం పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

ప్రజాశక్తి-మర్రిపాడు



మండలంలోని కదిరినాయుడుపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని ఉప్పనూతల మహిమ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రవి తెలియజేశారు. మహిమ పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 576 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం సాధించింది. ఇటీవల విడుదల చేసిన ట్రిపుల్ ఐటీ ఎంపిక ఫలితాల్లో ఇడుపులపాయలో సీటు సాధించింది. తమ పాఠశాల విద్యార్థిని ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంపై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థినికి అభినందనలు తెలియజేశారు. గ్రామానికి చెందిన ప్రవాస భారతీయులు రామిరెడ్డి ఓబుల్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, కేశవరెడ్డి, సుజాతమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి తదితరులు విద్యార్థినికి అభినందనలు తెలియజేశారు.

ఆహార నాణ్యతలో రాజీపడొద్దు

- ఫుడ్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ విజయ్‌ప్రతాప్ రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

అంగన్‌వాడీ, రేషన్ డీలర్లు, సంక్షేమ హాస్టల్లో సిబ్బంది బాధ్యతగా పనిచేసి, ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్థులకు అందించే పౌష్టికాహారం అందించడంలో రాజీ పడొద్దని రాష్ట్ర ఫుడ్ కమిషన్ విజయ్‌ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో నియోజకవర్గంలోని తహశీల్దార్లు, అంగన్‌వాడీ సిబ్బంది, ఎంఇఒలు, రేషన్ డీలర్లు, పౌరసరఫరాల శాఖ సిబ్బందితో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమైక్యంగా 2017లో ఫుడ్ కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు. ఐదుగురు ఐఎఎస్ అధికారుల ఈ కమిటీ ఫుడ్ కమిషన్ అధికారులను నియమించిం దని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో సద్విని యోగం అయ్యేలా ఆయా హాస్టళ్లల్లో, అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహకులు చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. రేషన్ పాయింట్ నుంచి డీలర్లకు కొంతమేర తక్కువ తూకంతో సరుకులు సరఫరా అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పట్టుబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి గురుకుల పాఠశాలలో ఎఎస్‌డబ్ల్యూఒలు వార్డెన్లు తరచూ పరిశీలించాలన్నారు. ప్రస్తుతం హాస్టళ్లకు అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే ఫోర్ట్‌ఫైడ్ బియ్యం ఎంతో నాణ్యతతో కూడినవని, ప్రభుత్వాలు రూ.60 చొప్పున కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నారని తెలిపారు. సరుకులు కాలపరిమితి దాటిన వాటిని చిన్నారులకు విద్యార్థు లకు వడ్డించ రాదని తెలిపారు. కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ సురేష్, అంగన్‌వాడీల జిల్లా పిడి హేనాసుజనా, జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు, తహశీల్దార్ లక్ష్మీ నరసింహ, ఎంఇఒ నజీర్ బాషా, సిడిపిఒ జైనకుమారి, ఎఎస్‌డబ్ల్యూఒ శ్రీదేవి, హాస్టల్ వార్డెన్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫుడ్‌కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి

ఆదర్శపాఠశాలలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని నందవరం ఆదర్శ పాఠశాలను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్ రెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆయన పాఠశాలను, పాఠశాల గదులను, బాలికల హాస్టల్‌ను, స్టాక్ రూమ్‌ను పరిశీలించి, మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందుతుందా.. లేదా.. రుచిగా.. ఉంటుందా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాలికల హాస్టల్ పిల్లలకు అందించే భోజనంలో నాణ్యతా ఉండాలన్నారు. అలాగే విద్యార్థులకు ఇచ్చే స్నాక్స్‌ను రుచి చూచి సంతృప్తి వ్యక్తం చేశారు. కాలం చెల్లిన పదార్థాలను తీసుకోవద్దని ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఆయనవెంట ప్రిన్సిపల్ శ్రీనివాసులు బోధన సిబ్బంది ఉన్నారు.



ప్రిన్సిపల్‌తో మాట్లాడుతున్న విజయ్‌ప్రతాప్‌రెడ్డి

16న భవన నిర్మాణ కార్మికుల సమావేశం

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం భవన నిర్మాణ కార్మికుల సంఘం సమావేశాన్ని ఆదివారం ఉదయం 8 గంటలకు సిఐటియు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు సిఐటియు మండల కార్యదర్శి చల్ల నరహరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 8 గంటలకు సిఐటియు కార్యాలయంలో జరిగే సమావేశానికి భవన నిర్మాణ కార్మికులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించేందుకు సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల సిపిఎం కార్యదర్శి తుమ్మల వెంకయ్య, మండల సిఐటియు ఉపాధ్యక్షుడు ఎస్‌కె.అన్వర్‌భాషా, విశ్వనాధరావు పేట కమిటీ సభ్యులు రామయ్య, కడనూతల శాఖ కమిటీ సభ్యులు పొట్లూరి శ్రీనివాసులు, సీనియర్ ఉప్పల యానాదయ్య పాల్గొన్నారు.

పొగాకు వేలం ధరలు పరిశీలన

ప్రజాశక్తి-మర్రిపాడు



మండలంలోని డిసిపల్లి పొగాకు బోర్డును రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు శుక్ర వారం సందర్శించి పొగాకు వేలం ప్రక్రియను, ధరలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుండి పొగాకు పంట రైతులుకు మంచి ఆదాయాన్ని ఇస్తుందని, రైతులు వచ్చే ఏడాది అధిక ధరలకు పొగాకు బ్యారన్లు పొలాలు లీజుకు తీసుకుంటున్నారని, దీని వల్ల ఖర్చులు బాగా పెరిగి నష్టాలు వచ్చే అవకాశం ఉందని, రైతులు పొగాకు బోర్డు అనుమతించిన మేరకే పొగాకు పండించాలని, ఎక్కువగా పొగాకు పంటని పండించడం వల్ల డిమాండ్ తగ్గి నష్టాలు వచ్చే అవకాశం ఉండవచ్చునని తెలిపారు. పొగాకు బోర్డు ద్వారా ఎరువులు, ఇతర ఇన్‌పుట్, ఫర్టిలైజర్ ఇండెంట్లను జూలై 26వ తేదీలోపు ఇవ్వాలన్నారు. సిటిఆర్ కందుకూరు వారి ద్వారా పొగాకు విత్తనాలు జూలై 19 నుండి ప్రారంభిస్తున్నట్లు, కమర్షియల్ నారుమడి రైతులు ఆగస్టు01 నుండి సిటిఆర్ఐ కందుకూరులో ఇస్తారన్నారు. రైతులు భూ సారన్ని పెంచుకునేందుకు వారి పొలాల్లో తప్పనిసరిగా పచ్చిరొట్ట ఎరువులను పెంచాలన్నారు. కార్యక్రమంలో వేలం నిర్వహణ అధికారి జి.రాజశేఖర్, పొగాకు బోర్డు సిబ్బంది, అధికారులు రైతులు పాల్గొన్నారు.

శంకర్‌రావు నియామకంపై హర్షం

ప్రజాశక్తి-కావలి

రాష్ట్ర ఎస్.టి. కమిషనర్‌గా మాజీ ఎంపి జీవీజీ శంకర్ రావును రాష్ట్ర ప్రభుత్వం నియమించడంపై జిల్లా మాజీ ఎస్.సి., ఎస్.టి. అట్రాసిటీ విజిలెన్స్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి వారికీ అభినందనలు తెలిపారు. పార్వతీపురం మాజీ ఎంపిగా గిరిజన హక్కుల పరిరక్షణలో వారి అభివృద్ధిలో, ముఖ్యంగా వారిని చైతన్య పరచడంలో జీవితాంతం కృషి చేశారని తెలిపారు. గిరిజన వర్గాల మేధావిగ పీడిత ప్రజల పక్షపాతిగా రాజ్యాంగ నిర్మాతల స్ఫూర్తితో ఆదివాసీలు, గిరిజన తెగలు వారి హక్కుల పరిరక్షణలో వారికి సాంఘిక న్యాయం అందించడం లోనూ నిరంతరం కృషి చేస్తూ ఎస్.టి.కమిషన్ చైర్మన్ వ్యవస్థకు వన్నె తేవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-మర్రిపాడు

నెల్లూరు ముంబై జాతీయ రహదారిపై డిసిపల్లి టోల్ ప్లాజా సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. హైదరాబాద్ నుండి ఎఎస్‌పేటకు వెళ్తున్న కారుకు ముందు వెళు _న్న బైక్ ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో ఈ ప్రమాదం జరిగిందని కారు యజమాని తెలిపారు. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో బైక్ కారు రెండు దెబ్బతిన్నాయి.

23న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో 23వ తేదీ ఆదివారం రోజున జరగబోయే ఉచిత వైద్య శిబిరం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాల డైరెక్టర్ ఎం.మాలకొండయ్య, వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షుడు షేక్ ఖాదర్ భాషా, విశ్రాంత లెక్చరర్ యమ్.వి.యన్. ప్రసాద్ రావుపాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాల డైరెక్టర్ ఎం.మాలకొండయ్య, వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షుడు షేక్ ఖాదర్ భాషా మాట్లాడుతూ సంయుక్త సేవాసంస్థ ద్వారా శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాలలో 23వ తేదీన ఆదివారం నిర్వహించబోయే 5వ ఉచిత వైద్య శిబిరానికి చుట్టుపక్కల ఎవరికైనా షుగర్, బిపి, సాధారణ గుండె సంబంధిత వ్యాధులు, చిన్న పిల్లల్లో పిడ్స్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారు ఉంటే వైద్య శిబిరం గురించి తెలియజేసి వైద్య సేవలు పొందేలా చేయమని తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో కావలి పట్టణంలోని ప్రముఖ వైద్యులు పాల్గొని ఉచితంగా పరీక్షలు నిర్వహించి రెండు నెలలకు సరిపడా మందులను కేవలం రూ.200లకే అందజేస్తామని తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో షుగర్, బిపి, రక్త శాతం, రక్తగ్రూపులు, ఇసిజి పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. కావున వ్యాధి గ్రస్తులును పై వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలు పొందేలా చేయమని విద్యార్థులకు తెలియజేశారు. అలాగే ప్రతి రెండు నెలలకోసారి నాల్గవ ఆదివారం ఈ వైద్య శిబిరం శ్రీ శ్రీనివాసు జూనియర్ కళాశాలలో జరుగుతుందని తెలిపారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ సంయుక్త సేవాసంస్థ ద్వారా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరం కావలి పట్టణం వెంగళరావు నగర్లో ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. కానీ ఊరి చివర కావడం కారణంగా పట్టణంలో పెడితే పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు కూడా ఈ వైద్య శిబిరం ఎంతగానో ఉపయోగ పడుతుందనే ఆలోచనతో శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాల యాజమాన్యాన్ని కోరిన వెంటనే ప్రతి రెండు నెలలకు ఒకసారి వైద్య శిబిరం నిర్వహించడం కోసం అనుమతినిచ్చారని తెలిపారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి నాల్గవ ఆదివారం వైద్య శిబిరం నిర్వహించడం కోసం అనుమతిని కోరిన వెంటనే స్పందించి అనుమతిని ఇచ్చిన శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాల కరస్పాండెంట్ బట్టేపాటి. అశోక్‌కు, డైరెక్టర్స్, ఎం.మాలకొండయ్య, కోటేశ్వరరావు, రమణా రెడ్డిలకు సంయుక్త సేవా సంస్థ ద్వారా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరానికి సంబంధించిన పత్రికలను అందజేశారు.



ఆదరణ కేంద్రానికి ఇన్వర్టర్ వితరణ

ప్రజాశక్తి-బిట్రగుంట

కావలి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఉన్న జి.లక్ష్మి ప్రసూన ముంగమూరు వద్ద ఉన్న భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలోని అనాథల సౌకర్యార్థం రూ.20 వేలు విలువ చేసే ఇన్వర్టర్‌ను శుక్రవారం బహుకరించారు. ఈ సందర్భంగా లక్ష్మి ప్రసూన మాట్లాడుతూ విద్యుత్ అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకొని అనాథల కోసం తనవంతు సహాయంగా పవర్ ఇన్వర్టర్ అందజేశా నని, ఆదరణ కేంద్రం నిర్వాహకులు డాక్టర్ కట్టిపల్లి సింహాద్రి, భవాని సేవలను ప్రసంసిస్తున్నానన్నారు. కేంద్రానికి సహకారం అందజే స్తామన్నారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి నెల్లూరు పాలెం క్లస్టర్‌కు చెందిన రైతులు 891పొగాకు బేళ్లను రైతులు వేలం కేంద్రానికి తీసుకురాగా, వీటిలో 864 బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్తులు కొనుగోలు చేశారనివేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. 11మంది కంపెనీ వ్యాపారస్తులు పాల్గొన్నారన్నారు.

యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-కావలి



రెడ్‌క్రాస్ ద్వారా సమాజసేవా కార్యక్రమాలలో పాల్గొనదలచిన వారు యాప్‌లో వలంటీర్లగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలక మండలి సభ్యులు డి.రవిప్రకాష్ కోరారు. శుక్రవారం ఆయన కావలి రెడ్‌క్రాస్ కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ సూచనల మేరకు రాష్ట్ర రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఏ శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అశ్వనికుమార్ పరిడలు పది లక్షల మంది నూతన వలంటీర్ల నమోదు కార్యక్రమం చేపట్టారన్నారు. రెడ్‌క్రాస్ వలంటీర్‌గా స్వచ్ఛంద సేవ చేయదలచిన వారు, గూగుల్ ప్లే స్టోర్ నుండి ఎపి రెడ్‌క్రాస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తమపేరు, వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. 8 నుండి 12వ తరగతిలోపు విద్యార్థులు జూనియర్ రెడ్‌క్రాస్‌లోనూ, డిగ్రీ, ఆపై చదివే విద్యార్థులు యూత్ రెడ్‌క్రాస్‌లోనూ, విద్యార్థులు కానీ 15 నుండి 40 సంవత్సరాలలోపు వయస్సు గలవారు రక్తదానం, విపత్తుల సమయాలలో సహాయత, వైద్య శిబిరాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, ప్రాథమిక చికిత్స శిక్షణ తదితర ఆసక్తి గల విభాగాలలో వలంటీర్లుగా చేరాలని వివరించారు. ఇతర వివరాలకు రెడ్‌క్రాస్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఏడుగురు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-సంగం

మండలంలో 2022-23 విద్యా సంవత్సరానికి విడుదలైన ఫలితాలలో ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. మండలంలోని మర్రిపాడు, తరుణవాయి, అన్నా రెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ట్రిబుల్ ఐటీ సాధించారు. అన్నారెడ్డిపాలెం జెడ్‌పి హైస్కూల్‌లో బి.కోటిభార్గవ్, బి.శివగీతిక, బి.స్మైలి, సిహెచ్ హిమవర్షిని ఐఐఐటీలో సీటు సాధించగా, తరుణవాయి జెడ్‌పి హైస్కూల్లో షేక్ షాకీర్, మోచెర్ల హిమబిందు సీటు సాధించగా, మర్రిపాడు జెడ్‌పి హైస్కూల్లో కాకర్ల అనంత్ ఐఐఐటి సీటు సాధించారు. ట్రిపుల్ ఐటీ సాధించిన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

హైకోర్టు న్యాయవాది నారాయణ మృతి

ప్రజాశక్తి-కావలి



హైకోర్టు న్యాయవాది, సీనియర్ టిడిపి నాయకులు మువ్వల వెంకట నారాయణ (71) శుక్రవారం ఉదయం 6గంటలకు ఒంగోలులోని అయన కుమార్తె ఇంట అనారోగ్యంతో తుది శ్వాశ విడిచారు. అయన భౌతిక కాయాన్ని కావలిలోని ఆయన స్వగృహానికి తరలించారు. యం.వి. నారాయణ కడు పేదరికం నుండి అంచలంచెలుగా ఎదిగి, తన పుట్టిన ఊరు కావలికి, నెల్లూరు జిల్లాకి కూడా పేరు ప్రఖ్యాతులు తెచ్చారు. నందమూరి తారక రామారావు ఎం.వి. నారాయణలోని మంచి గుణాలను గుర్తించి, కావలి నియోజకవర్గం నుండి శాసనసభ్యులుగా పోటీ చేయించారు. అనూహ్యంగా ఉప ఎన్నికలో కలికి యానాదిరెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. నారాయణ టిడిపి పార్టీలో ఎంతో విధేయుడిగా ఉన్నారు. ఎన్‌టిఆర్ ఆయనకు ఎపి ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారు. ఆ సందర్భంగా టిడిపికి ఎనలేని సేవలు చేశారు. ఎన్.టి.ఆర్. తర్వాత ముఖ్యమంత్రి అయిన నారా చంద్రబాబు నాయుడుకు కూడా సన్నిహితంగా మెలిగారు. న్యాయవాదిగా కూడా అయన టిడిపికి ఎన్నో సేవలు అందించారు. తన న్యాయవాద వృత్తిలో కూడా నెల్లూరు, గుంటూరు, ప్రకాశం జిల్లాల మంచి పేరు, ప్రతిష్టలు గడించారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ హై కోర్టులో కూడా సీనియర్ న్యాయవాదిగా పనిచేశారు. జిల్లా కన్స్యూమర్ ఫోరమ్ మెంబరుగా పనిచేసి, ప్రజలకు తన సేవలు విరివిగా అందించారు. ఆయన వద్ద ఎంతో మంది న్యాయవాదులు జూనియర్లుగా పనిచేసి ప్రస్తుతం ఉన్నత న్యాయవాదులుగా పనిచేస్తూ ఉన్నారు. వారిలో ముఖ్యంగా విశ్రాంత జడ్జి రాధమ్మ, మాజీ ఎ.జి.పి. టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సీనియర్ న్యాయవాది పొట్లూరు శ్రీని వాసులు, కోవూరు మాజీ ఎ.జి.పి. పి.వెంకటేశ్వరు, నాగ సుబ్రహ్మణ్యం, కందుకూరు మాజీ ఎ.జి.పి. మాల్యాద్రి, లీడింగ్ అడ్వకేట్‌లు పి.సునీల్ కుమార్ సింగ్, బి.వి.మధుసూదన రావు, ఇంకా ఎందరో శిష్యులు ఆయనకు ఉన్నారు. ఆయనకు భార్య ప్రముఖ న్యాయవాది సత్యవతి, కుమారులు సునీల్, రవీంద్ర (హై కోర్టు న్యాయవాది) కుమార్తెలు డాక్టర్ వసుధ, సుజనలు ఉన్నారు. కాగా ఎం.వి. నారాయణ భౌతిక కాయనికి శనివారం ఉదయం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

పలువురు ప్రముఖుల సంతాపం : ప్రముఖ హై కోర్టు న్యాయవాది మువ్వల వెంకట నారాయణ మృతికి టిడిపి, జనసేన పార్టీల నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించారు. కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు మాట్లాడుతూ ప్రముఖ హైకోర్టు న్యాయవాది, టిడిపి సీనియర్ నాయకులు మువ్వల వెంకట నారాయణ మరణం కావలి ప్రజానీకానికి తీరని లోటని తెలిపారు. జనసేన జిల్లా కార్యదర్శి. సమ్మను. వెంకట సుబ్బయ్య, కావలి టౌన్ సలహాదారుడు. బెల్లంకొండ. వెంకటేశ్వర్లు, టౌన్ కార్యదర్శి గుంటుపల్లి.కృష్ణయ్య, సీనియర్ నాయకులు తోకల. వెంకటేశ్వర్లు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు.